క్లుప్తంగా

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు



విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదో తరగతి చదివి మెరిట్ సాధించిన విద్యార్థులకు మంగళవారం నగదు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రథమ స్థానం సాధించిన వెలుగుల మధుశ్రీ, ద్వితీయ స్థానం పొందిన పైలా పూజిత, తృతీయ స్థానం సాధించిన భవానీలను అభినందించారు. ఎంపీటీసీ కట్టమూరి శ్రీనివాసరావు, కోట్ని శివ, కాసు అంజిరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఘనంగా ఎర్రవరం పరదేశమ్మ పండగ

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ఎర్రవరం గ్రామంలో పరదేశమ్మ పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు.తెల్లవారు జాము నుంచే భక్తుల తాకిడి పెరిగింది. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకునేందుకు భారీగా విచ్చేశారు. ఆలయాన్ని పూలతో అలంకరించారు. పండగను పురస్కరించుకొని పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కైలాసపట్నంలో జగనన్న సురక్ష నేడు

కోటవురట్ల: కైలాసపట్నం గ్రామ సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీ విశ్వనాథ రావు తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ పాల్గొంటారని తెలిపారు. విధిగా అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని సూచించారు.

ఘనంగా జగన్నాథ రథయాత్ర ప్రారంభం



నాగులాపల్లిలో జగన్నాథుని రథం లాగుతున్న భక్తులు

మునగపాక: మండలంలోని నాగులాపల్లి, మునగపాక గ్రామాల్లో జగన్నాథస్వామి రథయాత్ర మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి ఆయా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మునగపాక, నాగులాపల్లి గ్రామాల్లో రథంపై జగన్నాథ స్వామిని అన్ని వీధుల గుండా ఊరేగించారు. జై గంటలు కొడుతూ ఉత్సాహంగా నవరాత్రి వేడుకలను ప్రారంభించారు. ఈ నెల 29న జగన్నాథస్వామి ఉత్సవం కూడా ఘనంగా నిర్వహించేందుకు అవసరమయ్యే చర్యలు చేపడుతున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

రెండు గ్రామాల్లో విత్తన నమోదు నేడు

మునగపాక : మండలంలోని మూలపేట,మంగళవరపుపేట గ్రామాల్లో బుధవారం విత్తన నమోదు కార్యక్రమం జరుగుతుందని వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. మూలపేట రామాలయం వద్ద వీఏఏ కళ్యాణి, మంగళవరపుపేట ఆర్‌బీకేలో వీఏఏ శ్వేత ఆధ్వర్యంలో విత్తన నమోదు జరుగుతుందన్నారు. ఆర్‌జీఎల్ 2537 రకం 30 కిలోల బస్తా రూ.910, బీపీటీ 5204 రకం 25 కిలోల బస్తా రూ.780కు అందజేస్తామన్నారు. రైతులు ఆధార్‌తో పాటు వన్‌బీ తీసుకువచ్చి విత్తన నమోదు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

మెట్లపై నుంచి జారిపడి ఆలయ పూజారి మృతి

మునగపాక: టి.సిరసపల్లి వీరభద్రస్వామి ఆలయ పూజారి మెట్లపై నుంచి జారిపడి మంగళవారం మృతిచెందారు. గ్రామానికి చెందిన అప్పికొండ పోలాజీ వీరభద్రస్వామి ఆలయంలో పూజారిగా పనిచేస్తున్నారు. మూడు రోజుల క్రితం డాబాపై నుంచి దిగుతుండగా ప్రమాదవశాత్తూ కిందపడి తీవ్ర గాయాలపాలయ్యారు. అతనిని విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బాధిత కుటుంబానికి సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి నాగప్పారావు రూ.5వేలు, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు రూ.5వేలను అందజేశారు.

సంక్షేమం తలుపు తడుతోంది..



సుంకపూరులో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాబూరావు

కోటవురట్ల: అక్కా పింఛను అందుతోందా..బాబాయ్ రైతు భరోసా నిధులు పడ్డాయా..బంగారు తల్లీ బాగా చదువుకుంటున్నావా? అంటూ ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా పలకరిస్తూ సమస్యలు తెలుసుకున్నారు.

సుంకపూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఆ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ లబ్ధిని వివరించారు. ఎస్సీ కాలనీలో జల్ జీవన్ మిషన్ పథకంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వగా, సీసీ రోడ్లను అడ్డదిడ్డంగా తవ్వేసి వదిలేశారని కాంట్రాక్టర్ వైఖరిపై పలువురు ఫిర్యాదు చేశారు. వెంటనే కాంట్రాక్టర్‌తో రోడ్డును సరిచేయించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అర్ధంతరంగా నిలిచిపోయిన వెల్‌నెస్ సెంటర్ నిర్మాణానికి సంబంధించి అడ్డంకులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని డీటీ సోమశేఖర్‌కు ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చారన్నారు. సంక్షేమ పథకాల నగదును దేశంలో ఎక్కడా లేని విధంగా ఆర్భాటం లేకుండా నేరుగా లబ్ధిదారుల అకౌంట్లలోనే జమ చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఏదైనా పని కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారని, ఇపుడా పరిస్థితి ఉందా? అని ప్రశ్నించారు. కులం, మతం, రాజకీయం చేయకుండా అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. చిన్నారులకు బంగారు భవిష్యత్‌ను ఇచ్చేలా ఎన్నో సంస్కరణలు చేశారన్నారు. విద్యతోనే ఉన్నత జీవితం కలుగుతుందన్న భావనతో చిన్నారుల చదువుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నాడు–నేడు ద్వారా పాఠశాలను అభివృద్ధి చేసి మౌలిక సదుపాయాలను కల్పించడమే కాకుండా అమ్మ ఒడి పథకం ద్వారా చదువుకు ప్రోత్సాహం ఇస్తున్నారన్నారు. అలాగే రైతుకు, మహిళల ఆర్థిక పరిపుష్టికి, చిరు వ్యాపారులకు, కుల వృత్తుల వారికి ఆసరాగా నిలిచారన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలను అందిస్తూ పల్లెలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ అత్యధిక సీట్లతో సీఎంగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సీతారామరాజు, రెండో వైస్ ఎంపీపీ చక్కా సుజాత, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కిల్లాడ శ్రీనివాసరావు, సర్పంచులు చిటికెల కాశీ లక్ష్మి, కోసూరు అప్పారావు, పైల శివరామ్, కొరుప్రోలు శివకుమార్, ఎంపీటీసీ పెట్ల రాంబాబు, ఉప సర్పంచ్ లాలం సన్యాసినాయుడు, పార్టీ నాయకులు సిద్దాబత్తుల సత్యనారాయణ, చిటికెల రమణ, సిహెచ్.బాపన్నాయుడు, శింగంపల్లి కిషోర్, గొల్లు చిట్టిబాబు, ఎస్.వి.రమణమూర్తి, పైల నాని, శానాపతి రామునాయుడు, పారుపల్లి శ్రీను, అల్లు కిషోర్, పాత్రునాయుడు, సత్యం, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, డీటీ సోమశేఖర్, ఏవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి



కొక్కిరాపల్లి గురుకుల పాఠశాలలో అణిముత్యాలు విద్యార్థులను అభినందిస్తున్న ఎంపీపీ గోవింద్

యలమంచిలి : రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిదేనని ఎంపిపి బోదెపు గోవింద్ అన్నారు. మంగళవారం యలమంచిలి కొక్కిరాపల్లి గురుకుల పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా స్థానిక పాఠశాలలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన కె.రమ్యగీత, సిహెచ్. లోచన, సుప్రియకు బహుమతులు ప్రదానం చేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభు త్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులను ప్రో త్సహించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిందని అన్నారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు మళ్ల మాణిక్యంతో కలసి ఘనంగా సత్కరించారు. కౌన్సిలర్ గొర్లె వెంకట్, మణికంఠస్వామి, పాఠశాల కమిటీ చైర్మన్ ఎ.లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'గడప గడపకు' ముగింపు సభను విజయవతం చేయాలి

యలమంచిలి : ఈ నెల 23వ తేదీ శుక్రవారం నాడు అచ్యుతాపురం మండల కార్యాలయం వద్ద గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగింపు సభను విజయవంతం చేయాలని ఎంపీపీ బోదెపు గోవింద్ పిలుపునిచ్చారు. మంగళవారం యలమంచిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యలమంచిలి నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో ఎమ్మెల్యే కన్నబాబురాజు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం అచ్యుతాపురం మండల పరిషత్ కార్యాలయం ఎదుట గ్రౌండ్‌లో భారీ ముగింపు సభ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉత్తరాంధ్ర వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి పాల్గొననున్నారని తెలిపారు. పట్టణ, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు,ప్రజాప్రతినిధులు తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు యర్రయ్యదొర, మండల రూరల్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు గుప్తా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

23న 'గడప గడపకు' ముగింపు సభ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు రాజు

మునగపాక : ఈ నెల 23న అచ్యుతాపురంలో జరగనున్న వైఎస్సార్‌సీపీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు జామి రాజు(సింగర్‌రాజు) పిలుపునిచ్చారు. నాగులాపల్లిలో మంగళవారం పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా రూపొందించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో విజయవంతంగా ముగిసిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకోవడంతో పాటు నాలుగేళ్ల కాలంలో ప్రజలకు జరిగిన లబ్ధిని వివరించే అవకాశం కల్పించారన్నారు. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సారథ్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం ముగింపు సభ అచ్యుతాపురంలో జరుగుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు. వైస్ ఎంపీపీ చిందాడ దేవి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఉమామహేశ్వరరావు, ఎంపీటీసీ మళ్ల కాశీ సురేష్, పార్టీ నేతలు మళ్ల సూరప్పారావు, పెంటకోట జ్యోతి, ముచ్చకర్ల సత్యనారాయణ, యువజన విభాగం నాయకుడు బొడ్డేడ బుజ్జి పాల్గొన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు



కొరుప్రోలు రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉన్న వరి విత్తనాలు

ఎస్.రాయవరం : మండలంలో అన్ని రైతు భరోసా కేంద్రాల్లో వరి విత్తనాలు సిద్ధంగా ఉంచామని మండల వ్యవసాయాధికారి సౌజన్య తెలిపారు. మండలంలో 20 ఆర్బీకేల్లో ఆయా గ్రామాల విస్తీర్ణాన్ని బట్టి విత్తనాలు ఉంచామన్నారు. అయితే నిబంధనల ప్రకారం రైతు ముందుగా రైతు భరోసా కేంద్రానికి వచ్చి ఏ విత్తనాలు ఎన్ని కావాలనే విషయాన్ని నమోదు చేసుకోవాలన్నారు. అయిననప్పటికీ రైతులు వెంటనే సరఫరా చేసేందుకు కొన్ని విత్తనాలు ముందుగా అందుబాటులో ఉంచామన్నారు. రైతు భరోసా కేంద్రాల వారిగా విత్తనాలు వివరాలివి. ఎస్.రాయవరం ఆర్‌జీఎల్ 60 బస్తాలు, బిటి5204 రకం (15), ధర్మవరం అగ్రహారం ఆర్జీఎల్ (30), బీటి 5204 (10), సర్వసిద్ధి ఆర్జీల్ (66), ఉప్పరాపల్లి ఆర్‌జీఎల్ (75), ఎంటీయు (18), లింగరాజుపాలెం ఆర్‌జీఎల్ (54), బిటి 5204 (5), వాకపాడు ఆర్‌జీఎల్ (54) , బీటి 5204 (10), జీవీపాలెం ఆర్‌జీఎల్ (90), సైతారుపేట ఆర్‌జీఎల్ (66), పెనుగొల్లు ఆర్‌జీఎల్ (39), వమ్మవరం ఆర్‌జీఎల్ (45), బిటి 5024 (5), గెడ్డపాలెం ఆర్‌జీఎల్ (30), ఎంటీయు 1.5, తిమ్మాపురం ఆర్‌జీఎల్ (36), బిటి 5204 (50), పెద గుమ్ములూరు ఆర్‌జిఎల్ (99), ఎంటియు 1.02, బిటీ 5204 (5), దార్లపూడి ఆర్‌జీఎల్ (39), పెట్టుగోళ్లపల్లి ఆర్‌జీఎల్ (34.5), బిటి5204 (5),ఎంటియు 5.01, చినగుమ్ములూరు ఆర్‌జీఎల్ (45), బిటి 5204 (5), కొరుప్రోలు ఆర్‌జీఎల్ (60), గుడివాడ ఆర్‌జీఎల్ (39), బీటిబి (3) ,గుర్రాజుపేట ఆర్‌జీఎల్ (39), పెదఉప్పలం ఆర్‌జీఎల్ (60), బిటిబి (40) బస్తాలు వారిగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకాలు ఆధారంగా, కౌలు రైతులు కౌలు కాగితం ఆధారం విత్తనాలు తీసుకోవచ్చన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి

మునగపాక : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవరచుకోవాలని హిందూ ధర్మ ప్రచార పరిషత్ గురువు యల్లపు రమణ కోరారు. గణపర్తి రామాలయంలో మంగళవారం పరిషత్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలన్నారు. అలాగే దేవాలయాలను సందర్శించడం ద్వారా మానసిక ప్రశాంతత దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చదరం నాయుడు, పంతులు కిష్టప్ప, గ్రామస్తులు రామనాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, సత్తిబాబు, సత్యనారాయణ, బ్రహ్మ లింగం పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష దోహదం

మునగపాక : ప్రజా సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష పథకం దోహదపడుతుందని ఎంపీడీవో మన్మథరావు అన్నారు. జగనన్న సురక్ష పథకం అమలులో భాగంగా పైలట్ ప్రాజెక్ట్‌గా మండలంలోని వెంకటాపురం గ్రామాన్ని అధికారులు ఎంపిక చేశారు. మంగళవారం ఎంపీడీవో మన్మథరావు, తహసీల్దార్ ప్రకాశరావు, ఈవోఆర్డీ ఈశ్వరరావు కార్యక్రమం అమలుకు సంబంధించి పలు ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా మన్మథరావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ఇంకా అందని వారిని గుర్తించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సర్పంచ్ సుందరపు తాతాజీ, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రాంబిల్లి: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో కొండలరావు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అధికారులు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. సచివాలయాల వద్ద పలు రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేయడం జరుగుతుందన్నారు. తహసీల్దార్ భాగ్యవతి, జడ్పీటీసీ నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ శ్రీనుబాబు పాల్గొన్నారు.

విద్యుత్ కార్యాలయం వద్ద సీపీఎం ధర్నా

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం విద్యుత్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం మండల కన్వీనర్ ఆర్.రాము మాట్లాడుతూ ప్రజల కళ్లు గప్పి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను సర్దుబాటు అని చెప్పి పెంచిదన్నారు. పెంచిన విద్యుత్ ధరలను తగ్గించకుంటే ఉద్యమం చేపడతామని తెలిపారు. కూండ్రపు సోమునాయుడు, ఆర్.లక్ష్మి, ధర్మిరెడ్డి సన్యాసిరావు, బి.సన్నిబాబు పాల్గొన్నారు.

మునగపాక : ప్రజలపై అదనపు విద్యుత్ భారాలు తగ్గించాలని కోరుతూ మంగళవారం మునగపాక విద్యుత్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ అదనపు ఛార్జీల పేరుతో ప్రజలపై భారం మోపడం సరికాదన్నారు. స్మార్ట్ మీటర్ల ప్రతిపాదనలు విరమించుకోవాలన్నారు. అనంతరం ఏఈ గోపికి వినతి అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, బ్రహ్మాజీ, రామారావు, సత్తిబాబు, పరదేశినాయుడు, రమణ, సూరిబాబు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు

- ఫీల్డ్ అసిస్టెంట్లపై ఫిర్యాదులు
- ఇష్టారాజ్యంగా మస్తర్లు, బినామీ చెల్లింపులు
- అధికారుల పర్యవేక్షణ లోపం
- సామాజిక ఆడిట్ తనిఖీల్లో వెల్లడి



శ్రీరాంపురం ఫీల్డ్ అసిస్టెంట్‌పై తనిఖీ బృందం వెల్లడిస్తున్న నివేదిక

పాయకరావుపేట : మండలంలో చేపట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక మండల పరిషత్ ఆవరణలో మంగళవారం నిర్వహించారు. మండలంలో గత సంవత్సరం ఏప్రిల్ నుంచి ప్రస్తుత సంవత్సరం మే నెల వరకు 899 పనులు జరిగాయి. రూ.5,24,68,645 విలువ గల పనులను చేపట్టారు. అడిషనల్ పీడీ రోజారాణి ఆధ్వర్యంలో అధికార బృందం ప్రజా వేదిక నిర్వహించారు. మండలంలో గల శ్రీరాంపురం గ్రామంలో చేపట్టిన పనుల్లో అనేక అవకతవకలు జరిగాయని, ఫీల్డ్ అసిసెంట్ బత్తిన శ్రీనివాస్ ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారని ఆడిట్ బృందం వెల్లడించారు. రోజ్‌గార్ దివస్ సమావేశాలు నిర్వహించడం లేదని, చేపట్టిన పనుల రికార్డులు రాయడం లేదని వెల్లడించారు. జాబ్ కార్డులు ఉన్నప్పటికీ పనులు చేయడం లేదని, సంతకాలు చేయించవలసినప్పటికీ వేలిముద్రలు వేయిస్తున్నారని, మేట్‌లను ఇష్టారాజ్యంగా పనుల నుంచి తొలగిస్తున్నారని వెల్లడించారు. జాబ్ కార్డులు వున్న వారు పనులకు వెళ్లకపోయినా వేరొకరి పేరున వేతనదారులకు పేమెంట్లు చెల్లిస్తున్నారని వెల్లడించారు. ఫీల్డ్ అసిస్టెంట్ తన కుటుంబ సభ్యుల పేరున పనులు చేయకపోయినా వేతనాలు తీసుకుంటున్నట్టు రికార్డుల్లో వెల్లడైందన్నారు. జాబ్ కార్డులు అప్‌లోడ్ చేయడం లేదని, గ్రామంలో జాబ్ కారులు వున్నవారు ఫిర్యాదులు చేశారని తెలిపారు. దీనిపై అడిషనల్ పీడీ రోజారాణి స్పందించి గ్రామస్తులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కుమారపురం గ్రామంలో పనులు చేయకపోయినా సరే బినామీ పేర్లతో వేతనదారులకి పేమెంట్లు చెల్లిస్తున్నారని తనిఖీ బృందం వెల్లడించింది. చనిపోయిన వ్యక్తి పేరున కూడా ఉపాధి వేతనాలు పొందుతున్నారని సామాజిక తనిఖీ వెల్లడించింది. అరట్లకోట, పి.ఎల్.పురం, పెంటకోట, పెదరాంభద్రపురం, నామవరం, సీతారాంపురం తదితర గ్రామాల్లో కూడా కొందరు పనులు చేయకపోయినప్పటికీ వేతనదారులకు పేమెంట్లు చేసినట్టు రికార్డుల్లో నమోదు చేశారన్నారు. ఉపాధి పనుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయలేదని తనిఖీ బృందం వెల్లడించింది. ప్రజావేదికలో గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న పనులపై అధికారులు స్థానిక ఏపీవో హేమలత, కార్యాలయ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. పనులు చేసేటప్పుడు పర్యవేక్షణ లోపం, రికార్డులు, మస్టర్లు తనిఖీ చేయకపోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ ప్రజావేదికలో యలమంచిలి క్లస్టర్ ఏపీవో శ్రీనివాస్, సోషల్ ఆడిట్ విజిలెన్స్ అధికారి దివ్య, ఎంపీడీవో ఎ.సాంబశివరావు, ఎస్ఆర్‌పీ లక్ష్మణరావు, తనిఖీ బృందం, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చాం...



దుప్పుతూరులో నవరత్నాల అమలు గురించి ఆరా తీస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): ప్రతి ఇంటి సమస్య తీర్చడమే గడప గడపకు మన ప్రభుత్వ లక్ష్యమని యలమంచిలి ఎమ్మెల్యే ఉప్పలపాటి రమణమూర్తి రాజు (కన్నబాబు) అన్నారు.అచ్యుతాపురం మండలంలోని దుప్పుతూరు మంగళవారం ఉదయం ప్రారంభం అయిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే స్థానికులతో మమేకం అయ్యారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు గురించి ఆరా తీశారు. ఎవరికైనా సంక్షేమ పథకాలు అర్హత ఉండి రాకపోతే తమ దృష్టికి నేరుగా తీసుకురావాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. నవరత్నాల ద్వారా ఒక్కో ఇంటికి అందిన సంక్షేమ పథకం గురించి ఆరా తీశారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, సర్పంచ్ శంకర్‌రావు, ఎంపీపీ భర్త కోన బుజ్జి, జెడ్పీటీసీ లాలం రాంబాబు, కోఆప్షన్ జెడ్పీ సభ్యుడు నర్మాల కుమార్, మాజీ ఎంపీపీ చేకూరి శ్రీనివాసరాజు, విమలనాయుడు, శివ, ప్రకాశ్, రాజు, పిన్నంరాజు వాసు, అడిగర్ల దేవుడు, విజయ్, చేపల వెంకటరమణ, పల్లి శేషగిరిరరావు, పంచదార్ల పైడిరాజు, కొమ్మోజు ఈశ్వరరావు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి



విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న సెబ్ ఎస్ఐ గణేష్

యలమంచిలి : మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని యలమంచిలి ఎక్సైజ్ ఎస్ఐ గణేష్ అన్నారు. మంగళవారం యలమంచిలి పట్టణంలో పలు కళాశాలల్లో విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యలమంచిలి పట్టణంలో గీతాంజలి కళాశాలలో ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి కొకైన్, హెరాయిన్ వంటి మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలనే అంశంపై అవగాహన కల్పించారు. సమాజంలో విద్యార్థి దశ చాలా కీలకమైనది అని అన్నారు. యుక్త వయ స్సులో విద్యార్థులు చెడు స్నేహాల బారిన పడి దురలవాట్లకు లోనవడంతో కుటుంబాలు చిన్నాభిన్నమౌతున్నాయన్నారు. తల్లిదండ్రుల పర్యవేక్షణలో ఉపాధ్యాయుల సూచనలతో విద్యార్థులు సన్మార్గంలో నడిచి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, పోటీతత్వం అలవరుచుకుని సమాజంలో పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగం వల్ల ఆరోగ్యాలు దెబ్బతింటాయని, డ్రగ్స్ వినియోగించడం ఇతరులకు సరఫరా చేయడం చట్టరిత్యా నేరమని ఈ డ్రగ్స్,గంజాయి కేసుల్లో ఎవరైనా పట్టుబడితే వారికి కఠిన శిక్షలు పడతాయని హెచ్చరించారు. ఎక్కడైనా మాదక ద్రవ్యాల వినియోగం జరుగుతుంటే విద్యార్థులు తమకు సమాచారం అందిస్తే తగు చర్యలు తీసుకుంటామని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు ఎక్కడా బయటకు రాకుండా చూస్తామని, ప్రతి ఒక్కరూ సమాజంలో డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కళాశాల అధ్యపక బృందం ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కార్మికుల సమస్యలపై కమిషనర్ వీరయ్యకు వినతిపత్రం అందిస్తున్న యూనియన్ సభ్యులు

యలమంచిలి : మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు అన్నారు. మంగళవారం యలమంచిలి మున్సిపల్ కార్మికులు తమ సమస్యలపై మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ వీరయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు మాట్లాడుతూ కొంత కాలంగా బకాయి పడ్డ మున్సిపల్ కార్మికుల హెల్త్ అలవెన్స్‌లు వెంటనే ఇవ్వాలని, నూనెలు, సబ్బులు ఇవ్వాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని, కార్మికుల పీఎఫ్, ఇఎస్ఐ సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ వీరయ్యను, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావును కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నూకరాజు, వెంకటరమణ, శ్రీను, అప్పారావు పాల్గొన్నారు.

'ఆణిముత్యాలు' నగదు బహూకరణ



విద్యార్థులకు ఆణిముత్యాలు నగదు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న సర్పంచ్

ఎస్.రాయవరం : ఆణిముత్యాలు ద్వారా ప్రభుత్వం బాగా చదివే విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందివ్వడం శుభ పరిణామం అని గుడివాడ సర్పంచ్ దూళి శ్రీనుబాబు అన్నారు. గుడివాడ ఉన్నత పాఠశాలలో ఇటీవల 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకుల్లో నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సహకాలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. అమ్మఒడి ఇవ్వడంతో పాటు పాఠశాలలో నాణ్యమైన భోజనం, పుస్తకాలు, బ్యాగులు అందిస్తూ పాఠశాలలను నాడు నేడుతో నూతన హంగులు తీసుకువచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుల శ్రీపతిరాజు, మామిడి చంటి, జోగుబాబు, వర్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నూతన తహసీల్దార్



ఎమ్మెల్యేను కలిసిన తహసీల్దార్ విజయ్‌కుమార్

ఎస్.రాయవరం : మండల అధికారులు బాధ్యతగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్.రాయవరం తహసీల్దార్ కె.విజయ్‌కుమార్ కొరుప్రోలు క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌కుమార్ ఉన్నారు.

వైఎస్సార్ పశుబీమాపై విస్తృత ప్రచారం



పశు బీమాపై పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న వెటర్నరీ అధికారి డాక్టర్ వీర్రాజు

నక్కపల్లి : పాడి రైతుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ పశు బీమాను సద్వినియోగం చేసుకోవాలని నక్కపల్లి పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ వీర్రాజు తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పశు బీమాపై మండలంలో వివిధ గ్రామాలకు చెందిన పాడిరైతులు, వెటర్నటరీ అసిస్టెంట్లతో అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, ఎంపీడీవో సీతారామరాజు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ వీర్రాజు మాట్లాడుతూ పశుపోషణపైనే ఆధారపడి జీవిస్తున్న పాడిరైతులకు ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు సంభవించి పశువులు గొర్రెలు, మేకలు మరణిస్తే రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఈ పశుబీమా అమల్లోకి తెచ్చిందన్నారు. పశువుకు యజమాని ఉద్దేశ్యపూర్వకంగా హాని తలపెడితే ఈ బీమా వర్తించదన్నారు. అంతకు ముందే ఏదైనా ఏజెన్సీ ద్వారా బీమా చేయించినట్టయితే ఈ పశు బీమాకు అనర్హులన్నారు. శాశ్వత అంగవైకల్యం కలిగిన పశువులకు, గొర్రెలు, మేకలకు పందులకు ఈ బీమా వర్తించదన్నారు. ఈ సందర్భంగా ప్రీమియం వివరాలు వెల్లడించారు. ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం మాట్లాడుతూ పశుపోషణపైనే ఆధారపడి జీవిస్తున్న పాడిరైతులకు ఈ బీమా ఆర్థికంగా నిలుదొక్కుకోడానికి ఉపయోగపడుతుందన్నారు. పేదలకు ప్రీమియంలో ప్రభుత్వం కొంత మొత్తాన్ని కంట్రిబ్యూషన్‌గా చెల్లిస్తోందన్నారు. ఈ బీమా పథకంపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, ఈవోపీఆర్‌డీ వెంకటనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాంబిల్లి : మండలంలో కొత్తపేట ఫీడర్ పరిధిలో గల గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ రిషికేష్ తెలిపారు. జంగిల్ క్లియరెన్స్ పనుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.